
# తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే : ఎంపీ అర్వింద్



విశ్వంభర, నిజామాబాద్: ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చాటనుందని, ఐదు రాష్ట్రల్లో బీజేపీ అధికారంలోకి రానుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎంపీ అర్వింద్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ లో బీజేపీ భారీ మెజారిటీతో గెలవబోతుందని ఎంపీ అన్నారు. తెలంగాణాలోనూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం వెలువడే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బీజేపీ కి అనుకూలంగా రానున్నాయన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కమిషన్ ప్రభుత్వం నడుస్తోందని, అవినీతి పాలన కొనసాగుతోందని ఎంపీ అర్వింద్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో, పరిపాలనలో రేవంత్ ఘోరంగా ఫెయిల్ అని ఎంపీ అన్నారు. కాంగ్రెస్ పాలన చూస్తుంటే పాలనపై రేవంత్ కు ఏమాత్రం అవగాహన లేదని అర్థమవుతోందన్నారు. జిల్లాలో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2 లక్షల మెట్రిక్ టన్నులు కూడా సేకరించలేక పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకాని తనమే అని ఆయనన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఇంతటి జాప్యం జరుగుతోంటే జిల్లాకు చెందిన ప్రభుత్వ సలహాదారులు ఇద్దరు ఉండి ఏం చేస్తున్నారని అర్వింద్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను రేవంత్ రెడ్డి మర్చిపోయారని అర్వింద్ అన్నారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ పార్టీ మహిళలను వంచించిందన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్ పాపులర్ లీడర్ అని ఎంపీ అన్నారు. ఆయన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకోలేక పోతున్నారన్నారు. పేద ప్రజలకు ప్రతినెలా రేషన్ బియ్యం ఉచితంగా సరఫరా చేసేది కేంద్ర ప్రభుత్వమేనని ఎంపీ అన్నారు. రైతులు పండించే ప్రతి ధాన్యపు గింజను ఎఫ్ సి ఐ కొనుగోలు చేస్తోందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కారణంగానే పసుపుకు అధిక ధరలు వస్తున్నాయని, ఆర్థికంగా రైతులకు ప్రయోజనం కలుగుతోందని ఎంపీ అన్నారు. తెలంగాణలో రూ.7800 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కోసం ఈ నెల 10 న మోదీ రాష్ట్రానికి వస్తున్నారని, ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీ అర్వింద్ ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలను కేసీఆర్ మత్తుకు బానిసలను చేశారని, తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసి నట్లేనన్నారు. ఇటివల జగిత్యాలలో జరిగిన బిఆర్ఎస్ సభకు ఐదారు వేలకు మించి జనాలు రాలేరన్నారు. జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ లో ఎందుకు చేర్చుకున్నారో పాపం కేసీఆర్ కు కూడా తెలియదనుకుంటున్నానన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలుబీజేపీ హవాలో కొట్టుకపో తాయని ఎంపీ అర్వింద్ అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మోదీ తెలంగాణలో పర్యటిస్తున్నారని, ఈ నెల 10 హైదరాబాద్ లో జరిగే మోడీ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని మోడీ సభ జిల్లా ప్రభారీ, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పిలుపునిచ్చారు. మోదీ నాయకత్వంలో దేశం చాలా భద్రతగా ఉందని దేశ ప్రజలు ఫీల్ అవుతున్నారని ఆయన అన్నారు. మీడియా సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు దినేష్ కులాచారి పటేల్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, పార్టీ నాయకులు స్రవంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి బెదిరించారు

## కాల్పుల్లో గాయపడ్డ కమల్



**విశ్వంభర, కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలో తుపాకీ మోతలు కలకలం సృష్టించాయి. జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ దుకాణంలో ఆదివారం జరిగిన కాల్పుల ఘటనతో నగరవాసులు ఉలిక్కిపడ్డారు. దుకాణంలోకి మొదట ఒక వ్యక్తి వచ్చి చైన్ కావాలని అడిగినట్టు సిబ్బంది కమల్ తెలిపారు. అతడి ప్రవర్తనను ముందే అనుమానించినట్టు తెలిపారు. అంతలోనే మిగతా నలుగురు వ్యక్తులు లోపలికి వచ్చారని చెప్పారు. "నిందితులందరి వద్ద తుపాకీలు ఉన్నాయి. మమ్మల్ని బెదిరించి మోకాళ్లపై కూర్చోబెట్టారు. మా సిబ్బందిపై పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి బెదిరించారు. ఒక్కొక్కరిని తాళ్లతో కట్టేస్తున్నారు. దీంతో మేం తిరగబడ్డాం. వాళ్లు కాల్పులు జరిపి పరారయ్యారు" అని కమల్ తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ కమల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రోడ్డుపై నిందితులు పరిగెత్తడం చూశానని, తనను ఒక నిందితుడు తుపాకీతో బెదిరించాడని ప్రత్యక్ష సాక్షి శివకృష్ణ తెలిపారు.

# బాలుడి చేతిలో పేలిన బ్యాటరీ.. తెగిన వేళ్లు

విశ్వంభర, శివ్వంపేట: మెదక్ జిల్లా శివ్వంపేటలో బాలుడి చేతిలో బ్యాటరీ పేలింది. పేలుడు ధాటికి బాలుడి వేళ్లు తెగిపడ్డాయి. వెంటనే కుటుంబసభ్యులు అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి శివతేజ్ బ్యాటరీతో ఆడుకుంటుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

# అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోసం ఆదివాసీల తరలింపును మానుకోవాలి



విశ్వంభర, అచ్చంపేట : నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల్ల ఫారెస్ట్ లోని అమ్రాబాద్ మండలంలో మానవ హక్కుల వేదిక, దళిత బహుజన ఫ్రంట్ సంస్థలకు చెందిన ఆరుగురు సభ్యుల బృందం సార్లపల్లి గ్రామంలో పర్యటించారు. ముఖ్యంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి పి.శంకర్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శిడాక్టర్ ఎస్. తిరుపతయ్యతో కలసి ఆరు మంది బృందం వెళ్లింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టైగర్ రిజర్వ్ ప్రాంతం కోసం జరుగుతున్న విస్తాపన, దానికి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో ఉన్న అసత్యాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయనీ వారు ఆవేదన వ్యక్తం చేశారు. సార్లపల్లి గ్రామ పంచాయతీ, దాని పరిధిలోని కుడి చింతలబయలు, తాటిగుండల పెంట, వటవర్లపల్లి పంచాయతీ, కొల్లంపెంట గ్రామాలు మొదటి విడతలో విస్తాపనకు గురవుతున్నాయని ఆ విస్థాపనకు ఆదివాసి తెగలే స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారనే ప్రచారం రెవెన్యూ, అటవీ శాఖలు ముమ్మరంగా చేస్తున్నాయన్నారు. ఇప్పటికే స్వగ్రామం వదిలి పట్టణంలో స్థిరపడ్డ అది కొద్ది మంది ఆదివాసీలు తప్ప, దాదాపు ఆదివాసి, గిరిజనులెవ్వరూ వారి స్వగ్రామాలను వదిలి, అక్కడికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న బాచారం వంటి మైదాన ప్రాంతాల్లోకి వెళ్ళటానికి సిద్ధంగా లేరన్నారు. ఈ మధ్య తాము తరలివెళ్లడానికి సిద్ధం అని తీసిన ర్యాలీ లో పాల్గొన్నది సార్లపల్లి సర్పంచ్ భర్త తప్ప మిగతావారంతా గిరిజనేతరులేఅన్నారు. గత యాభై సం.లుగా పులికేబి అడవుల్లో జీవిస్తున్న మనుషులకు మధ్య అక్కడ ఏ ఘర్షణా జరగలేదనీ, పులి వెళ్ళే దారులు, పులి అలవాట్లు చెంచులకు సాంప్రదాయ పరంగా వచ్చిన జ్ఞానం అని పేర్కొంటున్నారు. ఇది పులికి-మనిషికి మధ్య ఒక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తుందనీ పులులను పెద్దమ్మ తల్లిగా కొలుస్తామని, తామెన్నడూ పులులకు హాని చేయలేదని, చేయమని ఆదివాసులు ముక్తకంఠంతో చెబుతున్నారని గుర్తు చేశారు. పులుల సంరక్షణ కోసమని మా జీవించే హక్కుకూ , గౌరవానికీ విలువ ఇవ్వకుండా, మా జీవితాలను చిన్నాభిన్నం చేసే ఈ తరలింపునకు మేము వ్యతిరేకమని చెంచు ఆదివాసిలు ప్రకటిస్తున్నారనీ పేర్కొన్నారు. అలా తరలించటం వల్ల షెడ్యూల్డ్ ప్రాంతపు మా హక్కులను కోల్పోతామని, అటవీ ఫలసాయాన్ని పొందే హక్కును, పశువుల మేతకు ఉపయోగపడే అడవిని కోల్పోతామనే బాధను వ్యక్తపరుస్తున్నారని పేర్కొన్నారు. ఆదివాసీలకు తగినంత వ్యవసాయ భూమి ఉందని తరలించడం ద్వారా కొత్త ప్రాంతంలో ఉపాధి దొరకగా అన్యాయానికి గురి అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవానికి చెంచు ఆదివాసి తెగ కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిన పీవిటిజి తెగకు చెందిన అట్టడుగు వర్గపు ఆదివాసీ తెగ అంతరించిపోవటానికి సిద్ధంగా ఉన్న ఇటువంటి పై తెగ ప్రజలకు ప్రత్యేక సంరక్షణ అందించాల్సింది పోయి, ఈ రకమైన విధానాలకు పాల్పడటం విచారకరం. అటవీ అధికారులు అక్రమ పద్ధతిలో గ్రామసభ తీర్మాలను చేయిస్తూ, గిరిజనేతరులను కూడగడుతూ, తరలింపునకు అందరూ సిద్ధంగా ఉన్నారని చేస్తున్న ప్రచారం పూర్తి నిజం కాదన్నారు. గ్రామ సభలు ఎక్కడా జరగలేదు. జరిగిన ఒక్క సార్లపల్లిలో డీఎఫ్వో ఆధ్వర్యంలో వారికి అనుకూలంగా ఉన్న కొద్ది మందితో సంతకాలు చేయించుకున్నారనీ ఆరోపించారు. తరలింపునకు అనుకూలంగా లేని ఆదివాసులను రెవెన్యూ, పోలీసు, అటవీ అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మొత్తం గ్రామాలు స్వచ్ఛందంగా తరలిపోతున్నట్టు, ఆ గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లు మొదలగు కొత్త ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తున్నారు. మహిళా సంఘ భవనానికి అనుమతి ఇవ్వటం లేదు. రోడ్లు వేయటం లేదు. ప్రజలను చైతన్యం చేస్తున్న వారిని బెదిరిస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారు. స్వచ్ఛందంగా వెళ్తామని ముందుకొచ్చిన గిరిజనేతురలతో ఇంగ్లీష్ భాషలో రాసిన అగ్రిమెంట్ మీద సంతకాలు పెట్టించుకోడం, 15 లక్షలు ఇస్తామని, భూములు ఇస్తామని , ఇళ్లు కట్టించి ఇస్తామని నోటిమాటగా చెప్పడం అభ్యంతకరం. పేరుకు స్వచ్ఛంద తరలింపు కానీ, వాస్తవంగా ఇది ప్రలోభ పూరిత, బలవంతపు తరలింపఅన్నారు.టైగర్ రిజర్వ్ ప్రాంతం నుంచి గ్రామస్థుల తరలింపునకు ప్రభుత్వం చేస్తున్న ఈ రకమైన ప్రయత్నాలను ఈ బృందం ఖండిస్తోందన్నారు. . వన్య ప్రాణుల సంరక్షణ ఎంత అవసరమో.. నిజానికి రాజ్యాంగపరంగా ఆదివాసులకు రాజ్యాంగం కల్పించిన 5 వ షెడ్యూల్లు, పీసా చట్టం,1/ 70 చట్టం అమలు చేయడం అంతే అవసరమన్నారు. ఆదివాసుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వమే, ఈ రకమైన నిర్లక్ష్యపు ధోరణిని అవలంబించటం సరైంది కాదన్నారు.

**ప్రధాన డిమాండ్లు..**

1. టైగర్ రిజర్వ్ కోసం ఆదివాసుల విస్తాపనను నిలిపివేయాలి.
2. కోరం తో కూడిన గ్రామసభ తీర్మానాలు మాత్రమే పరిగణలోకి తీసుకోవాలి. తరలింపుకు తాము వ్యతిరేకమని ఆదివాసీ ప్రజలు చేసిన గ్రామసభ తీర్మానాలను ప్రభుత్వం గౌరవించాలి.
3. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో వాళ్లు పొందే హక్కులను పరిరక్షించాలి. పీసా చట్టాన్ని , అటవీ హక్కుల చట్టాన్ని వాటి స్ఫూర్తితో అమలు పరచాలి. వారు ఉన్న ప్రాంతంలోనే విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలను పెంపొందించాలి.
4. విస్తాపనకు సిద్ధంగా లేని ప్రజలపై ప్రత్యక్ష, పరోక్ష వేధింపులను మానుకోవాలి.
5. గ్రామాలను వదిలి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్న వారికి ప్రభుత్వం నోటిమాటగా కాకుండా, ఆహామీలకుచట్టబద్ధతకల్పించి మాత్రమే తరలించాలి

ఈ నిజనిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళ రోహిత్, సంజీవ్, శ్రీధర్ , భరత్ మరియు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ పాల్గొన్నారు.

# తెలంగాణలో పలు జిల్లాల్లో వర్షం.. నేలకొరిగిన చెట్లు





**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఎండవేడితో అల్లాడుతున్న ప్రజలకు వానలు ఉపశమనం కలిగించాయి. సూర్యాపేటలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఇక్కడి మార్కెట్‌యార్డులో ధాన్యం, మొక్కజొన్న తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్‌లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మందమర్రి, సింగరేణి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో గాలి దుమారంతో భారీ వర్షం పడింది.ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడ, నేరేడుచర్ల, త్రిపురాంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. నకిరేకల్‌లో పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి.

# ఇకపై ఆర్డీఓ కార్యాలయంలో "ప్రజావాణి"



విశ్వంభర, మహబూబ్ నగర్ : ఇకపై ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కి ఇది కొనసాగింపు అని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 4వ తేదీ సోమవారం మహబూబ్ నగర్ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమంలో డివిజన్ స్థాయి ప్రజలు తమ సమస్యల ఫిర్యాదులను సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ఆర్డీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, డివిజినల్ పంచాయతీ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ, వ్యవసాయ సంచాలకులు, డిస్కాం డీఈ లు, ఆర్ అండ్ బీ, ఆర్.డబ్ల్యూ.ఎస్, హౌసింగ్ డీఈఈ లు, సీడీపీఓలు, సహాయ ఎస్సీ, ఎస్టీ, బీసీ, అభివృద్ధి అధికారులు డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని ఆమె ఆదేశించారు.

# వంద ఎకరాలకు పైగా జొన్న, మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి



**విశ్వంభర, నేరేడిగొండ :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు దాదాపు 100 ఎకరాలకు పైగా జొన్న, మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి అయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు దాదాపు 100 ఎకరాలకు పైగా ఉన్న జొన్న, మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు కాలిపోయింది. పంట పొలాలలో ఉన్న మోటార్లకు ఉన్న కేసింగ్ పైపులు, వైర్లు, పదుల సంఖ్యలో పైపులు కాలిపోవడంతో లక్షల్లో ఆస్థి నష్టం సంభవించిందని బాధిత రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ భూములలో ఉన్న పంటలు కాలిపోతున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు, రైతులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆలుగాలం కష్టపడి చేతికి వచ్చిన జొన్న, మొక్క జొన్న పంటలు రైతుల కండ్ల ముందరే కాలిపోతుండడం తో రైతులు మరియు వారి కుటుంబికులు కన్నీటి పర్యాంతమవుతూ ప్రభుత్వం తమని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'దోస్త్' ద్వారా అడ్మిషన్లు

## : ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్




విశ్వంభర, **మహబూబ్ నగర్ ప్రతినిధి :** ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సాంప్రదాయ కోర్సులతో పాటు ఉపాధినిచ్చే కోర్సులకు 'దోస్త్' ద్వారా అడ్మిషన్లు ప్రారంభమైనవని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో దిశతో మాట్లాడారు. ట్రెడిషనల్ డిగ్రీ కోర్సులైన, బీఏ (హిస్టరీ, మ్యాథమెటిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్) తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) ఇంగ్లీష్ మీడియం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్ (బోటనీ,జువాలజీ, కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, అప్లైడ్ న్యూట్రీషియన్) ఇంగ్లీష్ అండ్ తెలుగు మీడియంలో, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్) ఇంగ్లీష్ మీడియంలో అడ్మీషన్లు ప్రారంభమైనట్టు తెలిపారు.అదేవిధంగా ఉపాధినిచ్చే ఎంబెడెడ్ కోర్సులైన బి.కాం(ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్), బీఎస్సీ(హెల్త్ కేర్ సైన్స్) వంటి నైపుణ్యం కోర్సుల్లో కూడా ఛాయిస్ బెస్ట్ క్రెడిట్ సిస్టం పద్ధతిలో గల 32 కోర్సులను అభ్యసించేందుకు 'దోస్త్' ద్వారా తొలి విడత ఏప్రిల్ 15 నుండి మే 7 వరకు, రెండో విడత మే 15 నుంచి 25 వరకు, మూడవ విడత 31 నుంచి జూన్ 15 వరకు ప్రవేశాలను ఇలా మూడు విడతలుగా చేపట్టిన్నట్లు ఆయన వివరించారు. దోస్త్ హెల్ప్ లైన్ నెంబర్ 9440842201ద్వారా విద్యార్థినీలు రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్, సీట్ అలాట్మెంట్ చేసుకునే సదుపాయం కలదని, ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రెచ్చగొట్టి రాజకీయాలు చేయాలన్నదే హరీష్ రావు ఆలోచన : విప్ బీర్ల ఐలయ్య



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** హరీష్ రావు రైతుల పేరుతో రెచ్చగొట్టి ధర్నాలు చేస్తున్నారని, రెచ్చగొట్టి రాజకీయాలు చేయాలన్నదే హరీష్ రావు ఆలోచన అని ప్రభుత్వ విప్, బీర్ల ఐలయ్య ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారం కోల్పోయిన అక్కసుతో రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు నెలల పాటు ధాన్యం కొనుగోలు చేయకపోతే ధాన్యం మొలకెత్తిన విషయాన్ని మరిచిపోయారా అని ఆయన విమర్శించారు.హరీష్ రావు దొంగ ధర్నాలను రైతులు నమ్మరని, ఈ రైతులే గోరి కట్టి మమ్మల్ని ఇంట్లో కూర్చొబెట్టారు..కేసీఆర్ సుద్దపూసలా ఫామ్ హౌస్ లో కూర్చుని రైతులను రెచ్చగొడుతున్నారని బీర్ల ఐలయ్య విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతన్నలకు పెద్ద పీత వేస్తోందని, రాష్ట్రంలో 8 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు మూడు వేల కోట్ల రూపాయలను రైతులకు బోనస్ గా ఇచ్చామని, రైతు సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తున్నారని బీర్ల ఐలయ్య మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని, ప్రతి గింజను మా ప్రభుత్వం కొనుగోలు చేస్తామన్నారు.

# ఏం రాశారో కూడా తెలుసుకోలేని అసమర్థుడు..



విశ్వంభర, హైదరాబాద్: హామీలు, రైతు సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోసారి బహిరంగ లేఖ రాశారు. లేఖ రాస్తే ఎదురు దాడి చేయడం సరికాదన్నారు. కళ్లుండి చూడలేని కబోది తుమ్మల నాగేశ్వరరావు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అబద్ధాలు, అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల ఆస్కార్?కు అర్హులు అంటు ఎద్దేవా చేశారు. ఎంఎస్పీ చట్టం తెస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని సొంత పార్టీ మేనిఫెస్టోలో ఏం రాశారో కూడా తెలుసుకోలేని అసమర్థుడు తుమ్మల నాగేశ్వరరావు అంటూ విరుచుకుపడ్డారు. ఎంఎస్పీ అమలు బాధ్యత రాష్ట్రాలదేనని, ఫసల్ బీమా అమలు చేయకుండా రైతుల నోట్లో మట్టికొడుతోంది మీరు కాదా? అని ప్రశ్నించారు. ఎస్?డీఆర్ఎఫ్ పేరుతో ఏటా రూ. 400 కోట్లు కేంద్రం ఇస్తోందని ఆ డబ్బు ఏం చేస్తున్నారో లెక్కలు చెప్పగలరా అని నిలదీశారు. ఎరువులు సరఫరా చేయలేని అసమర్థ మంత్రి తుమ్మల అని కనీస మద్దతు ధర అందించడంతో పాటు ఎరువులు సరఫరా చేయలేని అసమర్థ మంత్రి అన్నారు. ఎంఎస్పీతో పాటు రబీసీజన్?లో అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# పట్టణాభివృద్ధికి కొరకు అందరూ సహకరించాలి : ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



విశ్వంభర, లక్షెట్టిపేట : మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కోరారు. పట్టణంలోని ఉట్కూర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు 80 ఫీట్ల రహదారి వెడల్పును తగ్గించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను, ప్రమాదాలను తగ్గించడానికి రోడ్ల వెడల్పు అత్యవసరమని, పట్టణ రూపురేఖలను మార్చి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. రోడ్ల వెడల్పు వల్ల పట్టణంలో ట్రాఫిక్ జామ్‌లు తగ్గుతాయి, ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు. వ్యక్తిగత నిర్ణయం కాదని, ఈనెల 07వ తేదీ నుంచి మున్సిపల్ అధికారులు సిబ్బందితో కూల్చి వేతలు ప్రారంభిస్తామన్నారు. పట్టణాభివృద్ధి కోసం కొద్ది పాటి అసౌకర్యాన్ని భరించి, మాకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, చెల్లా నాగభూషణం మోత్కూరి వెంకటస్వామి గౌడ్ దొంత నరసయ్య పాల్గొన్నారు.

# వన్యప్రాణులను వేటాడుతున్న ముఠా అరెస్టు

**విశ్వంభర, హైదరాబాద్:** గోల్కొండ పరిధిలో వన్యప్రాణులను వేటాడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురు సభ్యుల ముఠాను గోల్కొండ పోలీసులతో కలిసి టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు జింకలు, కుందేళ్లు, నెమళ్లను వేటాడుతున్నట్లు గుర్తించారు. 3 ఎయిర్ గన్స్, ఒక పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకూ 12 జింకలు, 400 కుందేళ్లు, ఒక నెమలిని వేటాడినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రేమ ప్రయాణం 'దిల్ ఝా' కవిత్వం

**విశ్వంభర, హిమాయత్ నగర్ :** అద్భుతమైన అనుభూతులను మధురమైన భావాలను మిళితం చేసిన ప్రేమ ప్రయాణం "దిల్ ఝా" ఝూన్సీ కవిత్వం అని సీనియర్ పాత్రికేయులు, కళ పత్రిక సంపాదకులు డాక్టర్ మహ్మద్ రఫీ అభివర్ణించారు. ఆదివారం అమెరికా ప్రవాస భారతీయ కవయిత్రి దిల్ ఝా ఝూన్సీ ప్రచురించిన హిందీ ఉర్దూ కవితా సంకలనం "వో ప్యార్ జో తేరా రహా" ఆవిష్కరణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ మహ్మద్ రఫీ ఈ కవితా సంకలనం ఆవిష్కరించారు. దిల్ ఝా కవిత్వం చదువుతుంటే ప్రేమ ప్రయాణంలా సాగిందని, మనసుకు హత్తుకునేలా ఉన్నదని అభినందించారు. కొన్ని ప్రేమలు కేవలం అనుభూతి చెందడానికి మాత్రమే కాదని, జీవన ప్రయాణంలో తమను తాము వెతుక్కునే ప్రేమలు అని వివరించారు. కవయిత్రి ఝూన్సీ మాట్లాడుతూ దిల్ ఝా తన కలం పేరు అని, ఈ తొలి కవితా సంకలనం తన హృదయ లోతుల్లో వున్న ఆలోచనలు, భావాలు, నిశ్శబ్ద క్షణాల సమాహారం అని చెప్పారు. చదివిన ప్రతి ఒక్కరూ అనుభూతి చెందేలా అర్థం చేసుకునేలా హృదయానికి దగ్గరయ్యేలా రాసిన భావాలు అని ఝూన్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జి.హెచ్.పి.రాజు, ప్రముఖ ఆంధ్ర నాట్యం నర్తకి, బ్యాంక్ ఆఫ్ అమెరికా డైరెక్టర్ కల్పనా రఘు, రచయిత నవీన్ సామల, రచయిత్రి ఫరాహ్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.